వ్యవసాయ డిగ్రీలో ప్రకృతి సేద్యం అవసరం

వ్యవసాయ యూనివర్సిటీ, మే 29: ప్రకృతి సేద్యాన్ని మరింత ప్రోత్సహించేందుకు దేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాల డిగ్రీ కోర్సుల్లో దాన్ని చేర్చాలని, అగ్రివర్సిటీల జాతీయ సదస్సులో తీర్మానించినట్లు గురువారం జాతీయ ఎన్ఐఆర్టీపీఆర్ డైరెక్టర్ ఆఫ్ జనరల్ తెలిపారు. ఇటీవల హైదరాబాదులోని జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థలో డీనుల సదస్సు జరిగిందని,వ్యవసాయ విశ్వవిద్యాలయాలు వ్యవసాయ విద్యా విధానాలు సవాళ్లు పురోగమనం అంశంపై ఇందులో చర్చ జరిగినట్లు పేర్కొన్నారు. 45 రాష్ట్రాలు ,కేంద్ర వ్యవసాయ, వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన 56 మంది డీన్‌లు, డైరెక్టర్లు హాజరయ్యారని తెలిపారు.

ఫేక్ ఫోన్‌పే చేసి..

వెంగళరావునగర్, మే 29 :ఏటీఎం కార్డు పని చేయడం లేదని చెప్పి ఓ విద్యార్థి వద్ద నగదు డబ్బు తీసుకుని ఫోన్ పే చేయకుండా ఉడాయించిన ఘటన ఎస్.ఆర్.నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం, గోపన్నపల్లికి చెందిన అల్లాడి శివశంకర వరప్రసాద్ ఎస్.ఆర్.నగర్ లోని లక్ష్య కళాశాలలో సీఏ ఫౌండేషన్ కోర్సు చదువుతున్నాడు.శ్రీ రాజరాజేశ్వరీ బాయ్స్ హాస్టల్లో ఉంటున్న ప్రసాద్ స్థానికంగా ఉన్న కెనరా బ్యాంక్ ఏటీఎం సెంటర్ కు వెళ్లి రూ.10 వేలు డ్రా చేసుకున్నాడు.ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తన ఏటీఎం కార్డు పనిచేయడం లేదని, అత్యవసరంగా డబ్బు అవసరపడిందని, రూ.10 వేలు ఇస్తే ఫోన్ పే చేస్తానని నమ్మించాడు.ఫోన్ పే లావాదేవి జరిగినట్లు ఓ మెసేజ్ చూపించి ప్రసాద్ వద్ద నగదు తీసుకుని వెళ్లి పోయాడు. తర్వాత ఫోన్ పేలో డబ్బుల కోసం చూడగా కనిపించక పోవడంతో మోసపోయానని గ్రహించి ఎస్.ఆర్.నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తి హెల్మెట్,మాస్కు ధరించి ఉన్నట్లు తెలిపాడు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గంధం చెట్లు నరుక్కుని..

వెంగళరావునగర్ : కేంద్ర ప్రభుత్వ సంస్థకు చెందిన నిమ్స్ మే (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ ప్రాంగణంలో ఉన్న గంధం చెట్లను నరుక్కుని అపహరించుకెళ్లారు దొంగలు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం రహ్మత్ నగర్ లోని నిమ్స్ మే ప్రాంగణంలోకి గురువారం అర్ధరాత్రి దాటాక 2.15 గంటలు సమయంలో ఓ దొంగ 3 గంధం చెట్లను నరుక్కుని అపహరించుకెళ్లాడు. అకౌంటెంట్ శ్రీనివాస్ వర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అపరిష్కృత సమస్యలు పరిష్కరించండి

– మున్సిపాలిటీలో అడుగడుగునా సమస్యల దర్శనం
– పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం
బీఆర్ఎస్ పార్టీ నాయకులు

మణికొండ, మే 29 : మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట ప్రజా సమస్యలు తెలుసుకుంటూ కొనసాగుతున్న కార్యక్రమం గురువారం అల్కాపూర్ టౌన్షిప్ లో నిర్వహించారు ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. లక్షలు పోసి మంచి నీటి కనెక్షన్లు తీసుకొని చివరకు ప్రతినిత్యం ట్యాంకర్ల మీదే ఆధార పడాల్సిన దుస్థితి ఏర్పడిందని, ట్యాంకర్లకు వేలకు వేలు ఖర్చు చేయడం జరుగుతోందని నాయకుల దృష్టి తీసుకొచ్చారు. స్పోర్ట్స్ పార్కులో నిర్మించిన 2. 5 ఎం.ఎల్.డి మంచినీటి రిజర్వాయర్ ప్రారంభోత్సవం కేవలం కాగితాలకే పరిమితమై, మంచినీటి వసతి కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజానీకానికి మంచినీరు అన్నది కంటి తుడుపు చర్యగానే మిగిలి పోయిందని వాపోయారు. అల్కాపూర్ టౌన్షిప్ లో నీటి సరఫరా జరుగుతున్న విధానంపై సమగ్ర విచారణ జరగవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.
హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధికారులు తక్షణమే స్పందించి తగి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మణికొండ బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీతారం ధూళిపాళ, కుంబగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేందర్నాథ్‌రెడ్డి, గోరుకంటి విఠల్, సంఘం శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, భానుచందర్, బాబు, సుమనళిని, షేక్ ఆరీఫ్, ఆరిఫ్ మొహమ్మద్, చెరుకూరి బాలాజీ, కందడ ప్రవీణ్, యాలాల కిరణ్ తదితరులు డిమాండ్ చేశారు.

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అల్కాపూర్ టౌన్షిప్‌లో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

బీసీ బిల్లును ఆమోదించాలి

హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్ గౌడ్

హిమాయత్ నగర్,మే 29: రాష్ట్రంలోని బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లును పార్ల మెంట్‌లో పెట్టి ఆమోదించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేక పోతుల నరేందర్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హిమాయత్ నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బీసీల సంక్షే మం కోసం జాతీయ స్థాయిల్లో ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసేందుకు కేంద్రం చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు శ్రీహరిగౌడ్, అధికార ప్రతినిధి శివకుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, తదితరులు

శంషాబాద్ రూరల్, మే 29 : అర్హులం దరికీ ఇండ్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ తెలిపారు. గురువారం శంషాబాద్ పట్టణంలోని మహిళా మండలి భవనంలో మున్సిపాలిటీకి చెందిన 524 మంది ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, మాజీ కౌన్సిలర్లు అజెయ్, జాంగీర్‌ఖాన్, కుమార్, రేఖా గుప్త, మాజీ సర్పంచ్‌లు సతీష్‌యాదవ్, లక్ష్మయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రూ. 55 లక్షలతో జట్టింగ్ మిషన్ వాహనం ప్రారంభం

15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.55 లక్షలతో శంషాబాద్ మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య పనుల నిమిత్తం జట్టింగ్ మిషన్ వాహనాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య పనులు చేయడానికి జట్టింగ్ మిషన్ లేక పోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటూ పరిశుభ్రం చేస్తున్నారు.

60 గజాల్లో ..ఇందిరమ్మ ఇండ్లు

సంతోషం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

శంషాబాద్ రూరల్, మే 29 : 60 గజాల స్థలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ కొన్ని రోజులుగా పెద్దషాపూర్‌తండా గిరిజనులు అధికారులను కోరుతున్నారు. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు గతంలో కేటాయించిన 60 గజాల స్థలాల్లో ఇండ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు. గురువారం శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ మండలంలోని పెదదషాపూర్ తండా గ్రామ రెవెన్యూ పరిధిలోని 220 సర్వే నంబర్ భూమిలో గతంలో పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న ఇండ్ల నిర్మాణానికి మొదట అనుమతిలేని వాటికి పలువురు అధికారులు ఆదేశించడంతో తామంత తహసీల్దార్ రవీందర్ దత్‌కు వినతి పత్రాలు ఇవ్వడంతో పాటు అనుమతి ఇవ్వాలని కోరిన్నట్లు తెలిపారు. స్పందించిన తహసీల్దార్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేసుకోవచ్చునని ఆదేశాలు ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు.

మాక్‌డ్రిల్ పై అవగాహన

అగ్ని ప్రమాదాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ ఫైర్ స్టేషన్ అధికారి చంద్ర నాయక్ పేర్కొన్నారు. గురువారం శివరాంపల్లి కేన్ వర్త్ అపార్ట్మెంట్ లో రాజేంద్రనగర్ ఫైర్ స్టేషన్ అధికారి చంద్ర నాయక్ అధ్వర్యంలో ప్రజలకు అగ్నిమాపక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. బండ్లగూడ, మే 29

నిమ్స్‌లో విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయం ప్రారంభం

ఖైరతాబాద్, మే 29 : నిమ్స్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయాన్ని డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, మెడికల్ సూపరిండెంటెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ,డీన్ ప్రొఫెసర్ లీజా రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శాంతివీర్ తో కలిసి ప్రారంభించారు. డైరెక్టర్ మాట్లాడుతూ..విశ్రాంత ఉద్యోగులు తమ సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్ బాబు, రామరాజు శరత్, నాగ రాజు, జి. రమేష్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ఎస్ఓ అధ్యక్షుడు లక్ష్మీనివాస్

బండ్లగూడ, మే 29: ప్రైవేట్ స్కూల్‌లలో ఫీజుల దోపిడీని అరికట్టి అనుమతిలేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ సంస్థ అధ్యక్షుడు లక్ష్మీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఆరాంఘర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, దుస్తులు ,పెన్నులను అడ్డ గోలుగా అమ్ముతున్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సమయంలో విచ్చలవిడిగా దండాలను కొనసాగిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఇబ్బందులు రాకుండా వాటిపై చర్యలు తీసుకునే విధంగా విద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లక్షల రూపాయలు ఫీజులను దోచుకుంటున్న ప్రైవేట్ పాఠశాలను గుర్తించి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో , తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్. టీఎస్ఎస్ఓ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కర్రె సుదర్శన్,టీఎస్ఎస్ఓ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి మీసాల వర్షిత్,టీఎస్ఎస్ఓ రాష్ట్ర నాయకులు సంపత్, గడ్డం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి

విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసిన డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, మే 29 : విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప సూచించారు. నిమ్స్ పారామెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 33వ వార్షికోత్సవాన్ని ఆస్పత్రి ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగుల పిల్లలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. నేటి విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ తమలో ఉన్న ప్రతిభను చాటి చెబుతున్నారన్నారు. నైపుణ్యాభివృద్ధి చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత శిఖాలను అధిరోహించాలన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన రుస్కార్ సారిక, వైష్ణవి, అంజిత్‌లను డైరెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ మెడికల్ సూపరిండెంటెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతివీర్, యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శాంతకుమారి, భరత్‌భూషణ్, శుభదా, సుధా తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో దరఖాస్తులు అందజేయాలి

అడ్డగుట్ట, మే 29: దరఖాస్తుదారులు అందించిన ఫారాలను మీసేవా నిర్వాహకులు సకాలంలో తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని మారేడ్‌పల్లి మండల తహసీల్దార్ భీమయ్యగౌడ్ సూచించారు. గురువారం మండల కార్యాలయంలో మీసేవా నిర్వాహకులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధ్రువీకర ణ పత్రాల నిమిత్తం మీసేవ కేంద్రానికి వచ్చే దరఖాస్తుదారుల నుంచి సంబంధిత సర్టిఫికెట్లకు అన్ని ఆధారాలను జతపరిచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. అనంతరం సదరు ఫారాలను వెంటనే సంబంధిత మండల కార్యాలయంలో అందజేయాలని ఆయన తెలిపారు. సర్టిఫికెట్లు నిర్ధారించిన తర్వాతనే దరఖాస్తు చేయడం ద్వారా ఎంక్వెయిరీ సులభతరం అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజునాయక్, సీనియర్ అసిస్టెంట్ మోహన్, స్పెషల్ ఆర్ఐ కృతిక, మీసేవా నిర్వాహకులు పాల్గొన్నారు.

కన్న కొడుకు నుంచి ప్రాణహాని

వెంగళరావునగర్, మే 29 : తన పెద్ద కొడుకు నుంచి రక్షణ కల్పించాలని వృద్ధ దంపతులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్.ఆర్.నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమీర్‌పేట గురుద్వారా సమీపంలో ఎస్.అమర్ సింగ్ భార్యతో కలిసి నివాసముంటున్నాడు.ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు.పెద్ద కుమారుడైన జస్బీర్ సింగ్ ప్రతి రోజూ ఇంటి కొచ్చి తండ్రి అమర్‌సింగ్‌తో పాటు తల్లి మీనాకౌర్‌ను ఇబ్బందులకు గురిచేసి కొడుతున్నాడు.గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న తండ్రికి వైద్యులు స్టంట్స్ కూడా వేశారు. కత్తెరతో కడుపుపై గాయపరిచాడు.వృద్ధులనే కనికరం లేకుండా తరుచూ దాడులకు పాల్పడుతున్నాడని తెలిపారు. తమతో పాటు చిన్న కుమారుడైన సుఖ్బీర్ సింగ్ ను కూడా పెద్ద కుమారుడి నుండి ప్రాణ భయం ఉందన్నారు. అతడి నుండి రక్షణ కల్పించాలని ఎస్.ఆర్.నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కౌంటర్‌రింగ్ పైనుంచి కిందపడిన కంటైనర్

కౌంటర్‌రింగ్ రోడ్డుపై నుంచి కంటైనర్ వాహనం కిందపడిన సంఘటన గురువారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఎఫ్‌ఆర్ఎస్ లాజిస్టిక్ కంపెనికి చెందిన కేఏ10ఏ 9205 నంబర్‌గల కంటైనర్ సామగ్రిని తీసుకొని తొండుపల్లి జంక్షన్ నుంచి కౌంటర్ రింగ్‌రోడ్డు మీదగా గచ్చిబౌలికి వెళ్తుండగా రాళ్లగూడ వద్దకు చేరుకున్న కంటైనర్ డ్రైవర్ రహీమ్ నిద్రమత్తులోకి జారుకోవడంతోనే కంటైనర్ కౌంటర్‌రింగ్‌రోడ్డుపై నుంచి కిందపడింది. ఈ ఘటనలో కంటైనర్ దెబ్బతిన్నట్లు వివరించారు. డ్రైవర్‌తో పాటు క్లీనర్‌కు స్వల్పగాయాలైన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. – శంషాబాద్ రూరల్

బాబుల్‌రెడ్డినగర్‌లో సమస్యల తాండవం

పట్టించుకోని అధికారులు - ఇబ్బందులు పడుతున్న పలువురు - శుభోదయ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు

ప్రమాదభరితంగా కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 29: ప్రజలు సానిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. శుభోదయం కార్యక్రమంలో భాగంగా గురువారం డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్‌లో బీఆర్ఎస్ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడ చూసినా దుర్గంధంతో నిండిపోయి ఉందన్నారు. రోడ్ల మధ్యలో నోరు తెరిచుకున్న మూతలు లేని మ్యాన్‌హోల్స్ ప్రాణాలు తీసే విధంగా ప్రమాదభరితంగా ఉన్నాయన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సైతం ఎలాంటి కంచెలు లేవన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లను ఇతర ప్రాంతాలకు తరలించాలని, పాతకాలం నాటి విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు.

ప్రణాళిక లేకుండా రోడ్ల నిర్మాణం...

అధికారులు, కాంట్రాక్టర్లు ప్రణాళిక లేకుండా ఇష్టానుసారంగా బాబుల్‌రెడ్డినగర్‌లో అడ్డదిడ్డంగా రోడ్లు వేశారన్నారు. ఆ రోడ్లు దేనికి ఉపయోగకరంగా లేకుండా మారాయన్నారు. ఆరు మాసాల క్రితం తవ్విన మట్టి కుప్పలను తొలగించకపోవడంతో అవి రోడ్ల మధ్యనే ఉండిపోయి వాహనదారులకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు రాఘవేందర్‌యాదవ్, సోమ శ్రీనివాస్‌గుప్తా, మైసిరెడ్డి, ఎడ్లకాడి సూర్యం, చిరంజీవి, జి.రాజు, హనుమంతు, కార్తీక్, వెంకటరమణ, ఉప్పల్ శ్రీను, అశోక్ కుమార్, భూదేవి, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు : ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఎస్సైగా పదోన్నతి పొందిన ఎస్. శ్రీరాములును ఏసీపీ సంజయ్ కుమార్, సీఐ రాజశేఖర్, ఇతర సిబ్బంది ఘనంగా సత్కరించారు.-ఖైరతాబాద్

శంషాబాద్‌లో భారీ వర్షం

శంషాబాద్ రూరల్, మే 29 : శంషాబాద్ పట్టణంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయంగా మారాయి. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రుతు పవనాల రాకతో వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజుల నుంచి శంషాబాద్ మున్సిపాలిటీలో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో వర్షాలు కురియడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోహిణి కార్తీలో వర్షం కురిస్తే వ్యవసాయ పంటలు సాగు చేయడానికి మంచి అవకాశమని పలువురు రైతులు వివరిస్తున్నారు.

ప్రత్యేక హోదా కల్పించాలి

సికింద్రాబాద్, మే 29: సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి లష్కర్ జిల్లా సాధన సమితి నేతలు గురువారం లేఖ రాశారు. సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్, కమిటీ సభ్యులు సీఎంకు లేఖను రిజిస్టర్ పోస్ట్ చేశారు.

ఇక్కడి నిధులు అక్కడికి...

1959వరకు ప్రత్యేక కార్పొరేషన్‌గా కొనసాగిన సికింద్రాబాద్‌ను 1960లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశార, అప్పటి నుంచి ఇక్కడ వసూలైన నిధులు మరో ప్రాంతానికి తరలిపోవడం ప్రారంభమైందని చెప్పారు. ఇక జీహెచ్ఎంసీగా ఆవిర్భవించిన తర్వాత ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయించినా అభివృద్ధి చెందుతున్న గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, హైటెక్‌సిటీ ప్రాంతాలకే మేలు జరుగుతుందని అన్నారు. ఈ విషయం సికింద్రాబాద్ ప్రాంత ప్రజలను తీవ్ర మనస్తాపానికి గురి చేస్తోందని తెలిపారు. ఈ పరిణామాలు చూస్తుంటే సికింద్రాబాద్ మరో పాత నగరంగా మిగిలి పోతుందనే ఆందోళన ఇక్కడి ప్రజాల్లో నెలకొందన్నారు.

సికింద్రాబాద్ ప్రాంతంపై చిన్న చూపు..

రోడ్ల విస్తరణ, నూతన ఫ్లైఓవర్ల నిర్మాణం, డైనేజీ వ్యవస్థను మెరుగు పరచక పోవడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లాంటి చర్యలు స్థానికుల జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతున్నదని అన్నారు. 2006లో సికింద్రాబాద్‌కు 200 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అప్పటి సీఎం వైస్ఆర్ ప్రకటించిన రూ.200 కోట్ల నిధుల విడుదల కూడా ఆయన మరణంతో మరుగున పడిందని గుర్తు చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరానికి ఎన్ని నిధులు కేటాయిస్తున్నా అవి సికింద్రాబాద్ ప్రాంత ప్రజలకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటు, శివారు మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో కలపడం లాంటి చర్యలు సైతం ఇక్కడి ప్రజలను మరింత ఆందోళనకు గురి చేసే అంశమని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్థానికుల కోరిక మేరకు సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక హోదా కేటాయించాలని, అంతేగాకుండా ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించి సికింద్రాబాద్ ప్రజలకు న్యా యం చేయాలని కోరుతున్నట్లు లేఖలో కోరారు.

స్కూటర్ పార్కింగ్ విషయంలో వివాదం

బంజారాహిల్స్,మే 29: స్కూటర్ పార్కింగ్ విషయంలో తలెత్తిన వివాదంలో మహిళలపై దుర్భాషలాడిన వ్యక్తులపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. యూసుఫ్‌గూడ బస్తీలో తల్లితో కలిసి నివాసం ఉంటున్న ఫరా(23) అనే యువతి ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. ఇటీవల తమ ఇంటిముందు షటిల్ ఆడుతున్న సమయంలో ఇంటిపక్కన ఉండే ప్రభాకర్ పల్లే అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో గొడవ జరిగింది. దీంతో పాటు ఫరాకు చెందిన స్కూటీ పార్కింగ్ విషయంలో గొడవ జరగడంతో ప్రభాకర్‌తో పాటు అతడి కుటుంబసభ్యులు తమను తీవ్ర పదజాలంతో దూషించారంటూ బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెళ్లికి ఒప్పుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటా
యువతిని బెదిరిస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్,మే 29: పెళ్లి చేసుకోవాలంటూ యువతిని వెంటపడి వేధిస్తుండడంతో పాటు ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించిన యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్‌నగర్‌లో నివాసం ఉంటున్న యువతి(24) జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో పనిచేస్తోంది. అక్కడే పనిచేస్తూ వెంకటగిరిలో నివాసం ఉంటున్న దూరపు బంధువైన ఎన్.అరవింద్ అనే యువకుడితో ఏడాది పాటు ప్రేమలో ఉంది. ఇరువురి కుటుంబ సభ్యులు వారి పెళ్లికి అంగీకరించకపోవడంతో తాను పెళ్లి చేసుకోలేనంటూ యువతి తేల్చిచెప్పింది. దీంతో గత మూడు నెలలుగా ఆమెను ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేస్తున్న అరవింద్ ప్రతిరోజూ వేధింపులకు గురిచేస్తున్నాడు.
ఈ క్రమంలో బుధవారం సాయంత్రం అపోలో ఆస్పత్రిలోని పార్కింగ్ స్థలంలో యువతిని అటకాయించిన అరవింద్ పెళ్లి చేసుకుంటావా లేదా అంటూ నిలదీశాడు. కుటుంబసభ్యుల ఇష్టానికి వ్యతిరేకంగా తాను వ్యవహరించలేనంటూ చెప్పగా తనతో పాటు తెచ్చుకున్న బ్లేడ్‌తో చేయి కోసుకున్న అరవింద్ ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించాడు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన బాధిత యువతి ఫిలింనగర్ ప